## భారతీయ మహిళలే టాప్

జీతాలు పెంచమనే మహిళల దేశాల జాబితాను 'ఇండీడ్' సైట్ జూన్ 3న వెల్లడించింది. దీనిలో భారతీయ మహిళలు టాప్ ప్లేస్‌లో నిలిచారు. భారతీయ మహిళల్లో 65 శాతం మంది జీతాలు పెంచాలని కోరారు. ఈ జాబితాలో రెండో స్థానంలో ఉన్న అమెరికాలోని మహిళలు 51 శాతం మంది జీతాల పెంపును కోరారు. ఫ్రాన్స్, జర్మనీల్లో 50 శాతం మంది, కెనడాలో 47 శాతం మంది, బ్రిటన్‌లో 45 శాతం మంది మహిళా ప్రొఫెషనల్స్ జీతాలు పెంచాలని యాజమాన్యాలను కోరారు. భారతీయ మహిళా ప్రొఫెషనల్స్ ఇతర దేశాల మహిళల కంటే ఎక్కువ ఆత్మవిశ్వాసం, ఆశావాదం గలవారని ఈ సైట్ పేర్కొంది. ఈ 'ఇండీడ్' సైట్ ఇండియా డైరెక్టర్ నిశిత లాల్వానీ.

# వికసిత్ భారత్ - రుతుపవనాలు - ఉత్తర మైదానాలు

**ప్రశ్న: వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం, వ్యవసాయ రంగంలో ఏ అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు వ్యాఖ్యానించండి?**

**జవాబు:** వికసిత్ భారత్ కోసం కేంద్ర ప్రభుత్వం తొమ్మిది అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు 2024-25 బడ్జెట్‌లో ఉద్ఘాటించింది. దీనిలో ప్రధాన అంశం వ్యవసాయ రంగం.

- దీనిలో భాగంగా రైతాంగానికి డిజిటల్ మౌలిక వసతులను సమకూరుస్తామని, దేశ వ్యాప్తంగా కోటి మంది సాగుదారులకు ప్రకృతి సేద్యంలోకి మళ్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. వాతావరణ మార్పులను తట్టుకునే వంగడాలు, అధిక దిగుబడి రకాలను అందుబాటులోకి తెస్తామన్న ప్రభుత్వ వాగ్దానాలు నిజం కావాలని రైతులు కోరుకుంటున్నారు.

**అంశాలు (ఆశలు, ఆశయాలు, లోటుపాట్లు)**

**1) కొత్త పంటలు**

- నీటిని విపరీతంగా వినియోగించుకునే ఆహార ధాన్య పంటలకు భారత్ ఎక్కువగా ప్రాధాన్యమిస్తుంది. ఈ పంటల వల్ల భూగర్భ జలాలూ తరిగిపోతున్నాయి. దీనివల్ల పంటల సాగులో వైవిధ్య తగ్గిపోతుంది. దేశీయ ఉత్పత్తి ద్వారా జాతి అవసరాలను పూర్తిగా తీర్చుకోలేక దిగుబడులపై ఆధారపడాల్సి వస్తుంది. దీనికి ఆనకట్ట వేసి కొత్త పంటల వైపు మళ్లేలా రైతులను ప్రోత్సహించాలని సంకల్పించింది. వరికి బదులు ఇతర పంటలు వేసే రైతులకు ఎకరానికి రూ.7,000 నగదు ఇస్తామని ప్రకటించింది.

**2) సహజ సాగు**

- భారతీయ 'ప్రాకృతిక్ కృషి పద్ధతి కార్యక్రమం' కింద సహజ సేద్యాన్ని విస్తరించాలని కేంద్ర బడ్జెట్ ప్రతిపాదిస్తుంది. వచ్చే రెండేండ్లలో కోటి మంది రైతులను ఈ ప్రకృతి సేద్యానికి మళ్లించాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఈ సహజ సేద్య పద్ధతిని క్రమంగా దేశమంతటికి విస్తరించాలి.

**3) సేంద్రీయానికి ప్రోత్సాహం**

- సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని పెంచడానికి కేంద్రం రూ.100 కోట్ల నిధిని ఏర్పాటు చేసింది. వీటితో పాటు జీవ ఎరువులను ప్రోత్సహించాలి.

**4) నిల్వ-శుద్ధి**

- వివిధ పంటల నిల్వకు, శుద్ధికి సరైన వసతులు లేకపోవడం వల్ల పంట కోత తర్వాత నష్టాలు పెరిగిపోతున్నాయి. భారత్ నుంచి వ్యవసాయ ఎగుమతులు పెరగకపోవడానికి కారణమిదే.

**ముగింపు**

- వికసిత్ భారత్ లక్ష్యాల సాధన కోసం భారత ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యమిస్తూ, వివిధ ఆశలు, ఆశయాలు సాధన కోసం వ్యవసాయ, సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.

**ప్రశ్న: నైరుతి రుతుపవనాలకు, ఈశాన్య రుతుపవనాలకు మధ్య తేడాలను తెలపండి?**

**జవాబు:** నైరుతి రుతుపవన కాలం వేసవికాలంలో అనుసంధానంగా ఉండి, వేసవి అనంతరం రుతుపవనాలు ఇస్తే ఈశాన్య రుతుపవన కాలం శీతాకాలంలో భాగంగా ఉండి, ఆ కాలం ఆరంభంలోనే రుతుపవనాలను ఇస్తుంది.

- నైరుతి రుతుపవనాలను వేసవి రుతువపనాలని, ఈశాన్య రుతుపవనాలను శీతాకాలపు రుతుపవనాలని అంటారు.
- నైరుతి రుతుపవనాలు దేశంలో అధిక ఉష్ణోగ్రతల వల్ల ఐటీసీజడ్ అల్పపీడనం వల్ల, టిబెట్ ప్రాంత అధిక ఉష్ణోగ్రతలతో కూడిన అల్పపీడనం వల్ల, పశ్చిమ జెట్ ప్రవాహాలు తూర్పు జెట్ ప్రవాహాలు ఎగువ ట్రోపోస్ఫియర్‌లో ఏర్పరిచిన అధిక పీడనం వల్లనో, అదేవిధంగా మాస్కరిన్ దీవుల వద్ద ఏర్పడిన అధిక పీడనం వల్ల సంభవిస్తే, ఐటీసీజడ్ దక్షిణార్ధగోళంలో ఉండటం ద్వారా ఉపఖండం మీద ఏర్పడ్డ అధిక పీడనం వల్ల ఈశాన్య రుతుపవనాలు సంభవిస్తాయి.

**తేడాలు**

1) నైరుతి రుతుపవనాలు సముద్రం నుంచి భూమి మీదకు వస్తున్న తేమతో కూడిన జలపవనాలు అయితే ఈశాన్య రుతుపవనాలు భూమి నుంచి సముద్రం వైపునకు వస్తున్న పొడి భూ పవనాలు.




2) నైరుతి రుతుపవనాలు ఎక్కువగా పర్వతీయ వర్షపాతాన్ని కొంత చక్రవాత వర్షపాతాన్ని ఇస్తుంటే ఈశాన్య రుతుపవనాలు చక్రవాక, పర్వతీయ వర్షపాతాన్ని సమానంగా ఇస్తున్నాయి.
3) నైరుతి రుతుపవనాలు రెండు శాఖలుగా విడిపోయి, ఒక్కో శాఖ 3 భాగాలుగా భారత్‌లోకి ప్రవేశిస్తాయి. ఈశాన్య రుతుపవనాలు ఒకే శాఖగా, ఒకే భాగంగా భారత్‌లోకి ప్రవేశిస్తాయి.
4) నైరుతి రుతుపవనాల వల్ల ఏర్పడిన చక్రవాకాలు తక్కువగా భారత పశ్చిమ తీరాన్ని తాకుతుంటే, ఈశాన్య రుతుపవనాల వల్ల ఏర్పడిన చక్రవాకాలు ఎక్కువగా భారత తూర్పు తీరాన్ని తాకుతున్నాయి.
5) దేశ సగటు వర్షపాతంలో 75 శాతాన్ని నైరుతు రుతుపవనాలు ఇస్తే, కేవలం 15 శాతం మాత్రమే ఈశాన్య రుతుపవనాలు ఇస్తున్నాయి.
6) నైరుతి రుతుపవనాలు భారత వ్యవసాయాన్ని, దాని అనుబంధ రంగాన్ని తద్వారా భారత ఆర్థిక వ్యవస్థను విపరీతంగా ప్రభావానికి గురి చేస్తుంటే వీటిపై ఈశాన్య రుతుపవనాల ప్రభావం తక్కువ.
7) నైరుతి రుతుపవనాలు భారత ఖరీఫ్ కాలంతో అనుసంధానాన్ని కలిగి ఉంటే, ఈశాన్య రుతుపవనాల రబీకాలంతో అనుసంధానాన్ని కలిగి ఉంటాయి.
8) వర్షాచ్ఛాయ ప్రాంతాలు మినహా మిగతా భారతదేశం అంతా నైరుతి రుతుపవనాల ఆక్రమణ జరిగితే కేవలం దక్షిణ భారతదేశంపై మాత్రమే ఈశాన్య రుతుపవనాల ఆక్రమణ ఉంటుంది.
9) నైరుతి రుతుపవనాలపై ఎల్‌నినో, లానినా, ఎంజేవో వంటి వాటి ప్రభావం ఉంటే, ఈశాన్య రుతుపవనాలకు అక్టోబర్ హీట్‌తో సంబంధం ఉంటుంది.



**ప్రశ్న: భారతదేశంలో ధాన్యాగారాలుగా పిలుస్తున్న ఉత్తర మైదానాలు ఎలా ఏర్పడ్డాయి?**

**జవాబు:** హిమానీ నదులు, వాటి ఉపనదుల నిరంతర శిథిలాల అవక్షేపణ ప్రక్రియ ద్వారా ఉత్తర మైదానాలు ఏర్పడ్డాయి. దేశంలో పశ్చిమాన పంజాబ్ నుంచి తూర్పున అసోం వరకు ఆగ్నేయాన, పశ్చిమాన పశ్చిమ బెంగాల్ వరకు సుమారు 7.50 లక్షల చ.కి.మీ. విస్తీర్ణంలో ఇవి ఏర్పడ్డాయి. ఉత్తరాన శివాలిక్ పర్వతాలకు దక్షిణాన ద్వీపకల్ప పీఠభూమికి మధ్యలో ఇవి ఏర్పడ్డాయి.

- వీటిలో స్థానిక లక్షణాలు రూపురేఖలు మొదలైన వాటి ఆధారంగా వీటిని బాబర్, టెరాయ్, బంగర్, ఖాదర్ అని సమాంతరంగా వర్గీకరించారు. రాష్ట్రాలు, ప్రధాన నదులైన సింధు, గంగ, బ్రహ్మపుత్ర ప్రాతిపదికన నీటిని పంజాబ్ మైదానాలు, రాజస్థాన్ మైదానాలు, ఎగువ గంగ, దిగువ గంగ, మధ్య గంగా మైదానాలు, బ్రహ్మపుత్ర మైదానాలుగా వర్గీకరించారు.

1) నది తనలో భారాన్ని తొలగించుకునే మైదాన ప్రాంతమైన 'బాబర్' శిలాజ నిక్షేపాలకు ప్రసిద్ధి.
2) చిత్తడిగా కనిపించే టెరాయ్ ప్రాంతం సహజ ఉద్భిజాలకు ప్రసిద్ధి.
3) నదీ ప్రవాహానికి దూరంలో కొంత ఎత్తులో వరద ప్రవాహం లేని ముదురు రంగులో గల 'బంగర్' మైదానాలు కొంత సారవంతమైనవి.
4) నదీ ప్రవాహానికి అత్యంత సమీపంలో వరద ప్రభావంతో కూడుకుని, లేత రంగులో కనిపించే 'ఖాదర్' మైదానాలు అత్యంత సారవంతమైనవి.

- ఇంచుమించు రుగ్వేద కాలం నుంచి ప్రస్తుతం వరకు కూడా భారతదేశ ఆహార ధాన్యాల అవసరాల్లో అగ్రభాగాన్ని అందిస్తూ భారతదేశ ధాన్యాగారాలుగా పిలుస్తున్నారు. వీటిలో ఎక్కువగా ఒండ్రు నేలలు ఉన్నాయి. కాబట్టి అన్ని రకాల ఆహార పంటలకు, చెరకు, జనుము వంటి వాణిజ్య పంటలకు, పండ్ల తోటలకు ఇవి ప్రసిద్ధి చెందాయి.
- వీటిలో 'పొటాష్' వంటి పోషకాలు ఎక్కువగా ఉన్నప్పటికీ నైట్రోజన్ లోపాన్ని కలిగి ఉన్నాయి.
- ఇవి చెరువులు మినహా అన్ని రకాల నీటి పారుదల వ్యవస్థకు అనుకూలమైనవి. వీటి ఉత్తర, దక్షిణ అంచుల్లో ముడిచమురు, సహజ వాయువు, అక్కడక్కడా బొగ్గు వంటి నిక్షేపాలు ఉన్నాయి. అన్ని రకాల రవాణా సౌకర్యాల ఏర్పాటుకు అత్యంత అనుకూలం కాబట్టి పై అన్ని లక్షణాల వల్ల ఈ ప్రాంతంలో జీవనానికి అత్యంత అనుకూల పరిస్థితులు ఏర్పడటం, వేదకాల మహాజనపద మగధ వంటి సామ్రాజ్యాల నుంచి బ్రిటిష్ కాలం వరకు కూడా జనాభా విస్ఫోటనం జరుగుతూ, జనసాంద్రతతో ఈ ప్రాంతాలు ముందు వరుసలో ఉన్నాయి.
- ఏవైతే అనుకూలతలు ఉన్నాయో, వాటిని అస్తవ్యస్తంగా వినియోగించడం ద్వారా ఈ మైదానాలపై ఒత్తిడి పెరిగి ఆ ఒత్తిడి తలతన్యతగా మారి, అవి కేశనాళికీయత అనే ప్రక్రియ ద్వారా లవణాలను నేలల ఉపరితలానికి తీసుకువచ్చి, ఆయా ప్రాంతాలను వ్యర్థ భూములుగా మారుస్తుంది. వీటినే ఉషర్ లేదా రే లేదా కల్లార్ మైదానాలు అంటారు.



**ప్రశ్న: మాంగ్రూవ్స్ అంటే ఏమిటి? వాటి ప్రాముఖ్యత, దేశంలో వాటి విస్తరణను గురించి పేర్కొనండి?**

**జవాబు:** మాంగ్రూవ్స్ (టైడల్) అరణ్యాలు అంటే ఇవి ఆర్ద్ర సతతహరిత రకానికి చెందిన అరణ్యాలు. ఉప్పునీటిలో పెరుగుతాయి.

- ఈ అరణ్యాల్లో పెరిగే వృక్షాలు గాలిలోని ఆక్సిజన్‌ను గ్రహించేందుకు 'న్యుమటోఫోర్స్' అనే నేల నుంచి గాలిలోకి పెరిగే ప్రత్యేకమైన వేర్లను కలిగి ఉంటాయి. ఇవి భౌమ ఆవరణ వ్యవస్థలు, జలావరణ వ్యవస్థలు కలుసుకునే సంధి ప్రాంతమైన 'ఎకోటోన్స్'లో విస్తరించి ఉంటాయి. అంటే మంచినీరు ఉప్పునీరు కలుసుకునే ప్రాంతాల్లో సమృద్ధిగా పెరుగుతాయి.
- ఇవి సముద్ర తీర ప్రాంత చీలికలు, ఎస్టురీస్, చిత్తడి నేలలు, నదీ ముఖ ద్వారాల వద్ద 40-200 సెం.మీ. వర్షపాతం గల ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. వీటినే మాంగ్రూవ్స్ అని, మడ అరణ్యాలు అని పిలుస్తారు. పశ్చిమ బెంగాల్‌లోని ఈ అరణ్యాల్లో సుంద్రీ అనే వృక్ష జాతి ఎక్కువగా విస్తరించి ఉండటంతో వీటిని అక్కడ 'సుందర్బన్ అరణ్యాలు' అని పిలుస్తారు. ప్రపంచంలోని మొత్తం మాంగ్రూవ్స్‌లో ఇవి 7 శాతం ఉన్నాయి.

**ప్రాముఖ్యతలు**

- పర్యావరణంగా ఇవి అత్యంత ప్రాముఖ్యత గల అరణ్యాలు. తీర ప్రాంత స్థిరీకరణలో, విలక్షణమైన జీవజాతులకు ఆవాసాన్ని కలిగించడంలో, సముద్ర ఉప్పునీరు తీర ప్రాంత డెల్టా నేలలోకి ప్రవేశించకుండా నియంత్రించడంలో, సైక్లోన్స్, సూపర్ సైక్లోన్స్ సమయాల్లో తీరాన్ని తాకే ఎత్తయిన కెరటాల నుంచి తీర ప్రాంత భూ భాగాలను పరిరక్షించడంలో, తీర ప్రాంతాల నుంచి వచ్చే ఎత్తయిన అలల నుంచి క్రమక్షయం చెందకుండా నిరోధించడంలో ఇవి కీలక పాత్ర వహిస్తాయి. మత్స్య సంపద, అభివృద్ధికి ఇవి అత్యంత అనుకూలమైన ఆవాసాలు.

**మాంగ్రూవ్స్ ఎదుర్కొంటున్న సమస్యలు**

- ఇటీవలి కాలంలో ఆక్వాకల్చర్, సెజ్‌లుగా ఈ ప్రాంతాలను ప్రకటించడం, టూరిజం లాంటి అభివృద్ధి కార్యక్రమాల వల్ల టైడల్ అరణ్యాలు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నాయి. వీటి పర్యవేక్షణ కోసం 1971లో 'రామ్‌సార్ ఒప్పందం' అమల్లోకి వచ్చింది. దేశంలో కూడా వీటి పరిరక్షణకు చర్యలు చేపట్టారు. కొన్ని మాంగ్రూవ్స్‌ను రక్షిత ప్రాంతాలుగా ప్రకటించారు.
- ప్రస్తుతం దేశంలో 38 మాంగ్రూవ్స్ అటవీ ప్రాంతాలు ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనవి.

1) **సుందర్బన్స్- పశ్చిమ బెంగాల్**
- ఇది ప్రపంచంలోనే అతి పెద్ద మాంగ్రూవ్స్. ఇది రాయల్ బెంగాల్ టైగర్స్‌కు ప్రసిద్ధి.

2) బితర్‌కనిక- ఒడిశా
- ఇది మొసళ్లు, ఆలివ్ రిడ్లే తాబేళ్లకు ప్రసిద్ధి చెందింది.

3) కొరింగా- ఆంధ్రప్రదేశ్ (తూర్పు గోదావరి)
- ఇది మొసళ్ల సంరక్షణ ప్రాంతం

4) పాయింట్ కలిమెరి- తమిళనాడు
5) పిచ్చవరమ్- తమిళనాడు
- ఇది దేశంలో అతిపెద్ద మాంగ్రూవ్స్.

6) వెంబనాడ్- కేరళ
7) కొండాపూర్ (షోలా అడవులు)- కర్ణాటక
8) రత్నగిరి/ ఆచ్ర, మహారాష్ట్ర
9) గల్ఫ్ ఆఫ్ కచ్- గుజరాత్
10) గల్ఫ్ ఆఫ్ ఖంబట్- గుజరాత్
11) నికోబార్- నికోబార్ దీవులు

**జీ గిరిధర్**
సివిల్స్ ఫ్యాకల్టీ
ఉస్మానియా యూనివర్సిటీ
హైదరాబాద్, 9966330068

